క్లుప్తంగా

శాస్త్రోక్తంగా కలశ ప్రతిష్టాపన



కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కణేకల్లు: మండలంలోని ఆదిగానిపల్లిలో శుక్రవారం పెద్దమ్మ అవ్వ ఆలయ గోపుర కలశ ప్రతిష్టాపన శాస్త్రోక్తంగా జరిగింది. పెద్దమ్మ అవ్వ మొక్కుబడి తీర్చుకునేందుకు వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపాల్ సొంత డబ్బుతో కలశాన్ని చేయించారు. ఈ కలుశాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి నుంచి ఆలయానికి తీసుకొచ్చారు. అర్చకులు కలశానికి పంచగవ్యంతో శుద్ధి చేసి శ్రీసూక్తంతో హోమం చేసి, ప్రతిష్ట చేశారు. అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం కుంకుమార్చన, మహా మంగళారతులిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మణికంఠ, నాయకులు నగేష్, చిన్న వెంకటేశులు, రామూర్తి, నాగేంద్ర, పోతన్న, శివదోణప్ప, గ్రామ పెద్దలు విరూపాక్ష ఎల్లప్ప, పెద్ద ఆంజనేయులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట

- జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ జడ్జి రాజశేఖర్



మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ జడ్జి రాజశేఖర్

కూడేరు: సమష్టి కృషితో బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయొచ్చని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ జడ్జి రాజశేఖర్ అన్నారు. శుక్రవారం కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయంలో «బాల్య వివాహాలు నిరోధించడం»పై మండల స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ జడ్జి రాజశేఖర్ మాట్లాడుతూ బ్యాల వివాహాల జీవోలు 31,39ల ఆవశ్యకతపై వివరించారు. బాల్య వివాహాలను అరికట్టేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఆర్ఎంహెచ్ఓ డాక్టర్ హేమలత, న్యాయవాదులు మహేష్, అనూష, విజయ దుర్గ, ట్రైబల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ సురేష్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సురేఖ, ఏపీఎం దేవానంద పిలిప్సన్, మహిళా పోలీసులు, ఐసీడీఎస్, వెలుగు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ వాయిదా పడిన మండలమీట్

గుమ్మఘట్ట: మండల సర్వసభ్య సమావేశం అనివార్య కారణాల వల్ల మళ్లీ వాయిదా పడినట్లు ఎంపీడీఓ రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

పోటాపోటీగా వినాయక లడ్డూ ప్రసాద వేలం



లడ్డూను పద్మా గోవిందు, అలివేలమ్మ దంపతులకు అందించిన సేవాకమిటీ సభ్యులు

బెళుగుప్ప: బెళుగుప్ప విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద వినాయక లడ్డూ ప్రసాదం వేలం పాట శుక్రవారం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నిర్వాహకులు విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి రూ.1116 వేలం పాట ప్రారంభించారు. బెళుగుప్పకు చెందిన పద్మా గోవిందు సేవాకమిటీ భక్తుడు రూ.75,001 నగదుతో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే శాంతప్ప కుమార్తె మృతి



ప్రేమలీల మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం: కంబదూరు మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే శాంతప్ప కుమార్తె ప్రేమలీల (90) శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీ లక్ష్మీదేవి తనయుడు భీమేష్, పార్టీ మండల కన్వీనర్ హనుమంతరాయుడు, నాయకులు శివప్రసాద్, గోపి, విల్సన్, రాజు తదితరులు ప్రేమలీల మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

పార్వతీ సుతుడా.. ఇక సెలవ్







కలుగోడులో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు, బొమ్మనహాళ్‌లో వినాయక విగ్రహాలను ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం, శెట్టూరులో నిమజ్జన వేడుక

రాయదుర్గంటౌన్: పట్టణంలోని వాడవాడలా కొలువుదీరిన గణనాథులు శుక్రవారం పలుచోట్ల గంగమ్మ చెంతకు చేరాయి. పట్టణం, రూరల్ పరిధిలో మొత్తం 96 చోట్ల బొజ్జగణపయ్యలు కొలువుదీరగా, మూడోరోజు శుక్రవారం దాదాపు 30కిపైగా మంటపాల్లోని గణనాథులను మొలకాల్మూరు రోడ్డు నాన్ చెరువుకు నిమజ్జనానికి తరలించారు. భారీ విగ్రహాలను కణేకల్లులోని హెచ్చెల్సీ కెనాల్‌కు తరలించారు. అర్బన్ సీఐ జయనాయక్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

గంగఒడికి గణనాథుడు

కణేకల్లు: మండలంలోని గరుడచేడు, కణేకల్లులో శుక్రవారం వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన వినాయక ప్రతిమలను ట్రాక్టర్లలో ఊరేగించారు. ఊరేగింపు అనంతరం హెచ్చెల్సీలో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. గరుడచేడు గ్రామంలో జరిగిన వినాయక ఊరేగింపు, నిమజ్జనంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీపీ వంద్రయ్య పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, నేత్రపల్లి, గుమ్మఘట్ట, గలగల, గొల్లపల్లి, కె.పి.దొడ్డి, గోనబావి, పూలకుంట, 75వీరాపురం, జె.వెంకటంపల్లి, రంగచేడు, రంగసముద్రం, ఆర్.కొత్తపల్లి, సిరిగెదొడ్డి తదితర గ్రామాల్లో శుక్రవారం నిమజ్జనం చేశారు. కొలువుదీరిన మంటపాల్లో ముందుగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ట్రాక్టర్లు,ఎడ్లబండ్లపై ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సమీపంలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

బొమ్మనహాళ్: వినాయక చవితి పురస్కరించుకొని వాడవాడలా కొలువుదీరిన వినాయక విగ్రహాలను మూడురోజుల పాటు పూజలు నిర్వహించి, శుక్రవారం నిమజ్జనం చేశారు. మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, దర్గాహొన్నూరు, గోవిందవాడ, గోనేహాళ్, ఉంతకల్లు, ఉంతకల్లు క్రాస్, దేవగిరి, నేమకల్లు, బండూరు, సింగానహళ్లి, ఉప్పరహాళ్, ఎల్‌బీనగర్ తదితర గ్రామాల్లో విశేష పూజలందుకున్న వినాయకుడిని ట్రాక్టర్లు, ఎండ్ల బండ్లపై కొలువుదీర్చి, తప్పెట్లు, మేళతాళాలతో వీధుల్లో ఊరేగించారు. యువకులు డప్పులు వాయిస్తూ రంగులు చల్లుతూ హంగామా చేశారు. జై.. గణేశ..జైజై గణేశా అంటూ కేరింతలు కొట్టారు. విగ్రహాలను హెచ్చెల్సీ కాలువ, వేదవతి హగరి నదిలో నిమజ్జనం చేశారు. ఎస్ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోలాహలంగా గణేశుడి నిమజ్జనం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో గణేశుడి నిమజ్జనం శుక్రవారం కోలాహలంగా నిర్వహించారు. పట్టణ సమీపంలో నీటికుంటలు లేకపోవడంతో పదికిలోమీటర్ల దూరంలోని బెలుగుప్ప మండలం బ్రాహ్మణపల్లి తండా వద్ద నున్న చెరువులో నిమజ్జనం చేశారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో నిమజ్జనం సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేశారు.

శెట్టూరు: మండలంలోని శెట్టూరు, కనుకూరు, లక్ష్మంపల్లి, తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జనం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల్లో మూడు రోజుల నుంచి ప్రత్యే పూజలందుకున్న వినాయకుడు శుక్రవారం సాయంత్రం పురవీధుల గుండా గణపతి విగ్రహాలను ఊరేగించారు.

వైభవంగా వినాయక నిమజ్జనం

ఉరవకొండ రూరల్: మండలంలో వినాయక నిమజ్జనం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనానికి తరలించారు. మంటపాల వద్ద తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అర్బన్ సీఐ మహానంది, ఎస్ఐ జనార్దన్‌నాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బెళుగుప్ప: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం శుక్రవారం నిర్వహించారు. వినాయక మంటపాల వద్ద అన్నదానం నిర్వహించారు. అనంతరం ట్రాక్టర్‌లు, ఎడ్లబండ్లపైనా, వాహనాల్లో వినాయక ప్రతిమలను నిమజ్జనానికి ఊరేగింపుగా తరలించారు. బ్రాహ్మణపల్లి తండా, బెళుగుప్ప తండా, దుద్దేకుంట, కోనంపల్లి, బెళుగుప్ప, జీడిపల్లి, ఎర్రగుడి, గుండ్లపల్లి, నరసాపురం, యలగలవంక, కాలువపల్లి, హనిమరెడ్డిపల్లి గ్రామాల సమీపంలోని చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం నిర్వహించారు. దుద్దేకుంటలో వాల్మీకి సేవాసమితి లడ్డూ వేలం నిర్వహించగా, కుల్లాయప్పగారి రుద్రప్ప రూ.42వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు. ఎస్ఐ శివ, ఏఎస్ఐ రామదాసులు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కూడేరు: మండల వ్యాప్తంగా వినాయకుడి నిమజ్జనం శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. వినాయక ప్రతిమలను బొలెరో, ట్రాక్టర్లలో ఉత్సాహంగా ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువులు, నీటి కుంటల్లో నిమజ్జనం చేశారు.

వజ్రకరూరు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. వినాయక ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఎస్ఐ నాగస్వామి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



కళ్యాణదుర్గం: నిమజ్జనంలో కేరింతలు కొడుతున్న యువత



గరుడచేడులో వినాయకుడి ఊరేగింపు



కణేకల్లులో వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం



కళ్యాణదుర్గం: నిమజ్జనానికి తరలి వెళ్తున్న వినాయకుడు



ఉద్దేహాళ్‌లో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



రాయదుర్గం ఓబుళాచారి రోడ్డులో గరుడవాహనంపై వినాయకుడు



వజ్రకరూరులో వినాయక ప్రతిమలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న దృశ్యం



కూడేరు: వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న దృశ్యం



దుద్దేకుంటలో వేలంలో లడ్డూను దక్కించుకున్న రుద్రప్ప



రాయదుర్గంలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



రాయదుర్గంలోని నాన్ చెరువులో చిన్నారులతో కలిసి గణపయ్యలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం



రాయదుర్గం వద్ద గంగవడికి చేరుతున్న గణపతి



బ్రాహ్మణపల్లి తండా చెరువు వద్ద క్రేన్ ఏర్పాటు చేసిన అధికారులు

దేశ భాషలందు తెలుగు లెస్స



విజేతలను అభినందిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అధ్యాపక బృందం



తెలుగు బాషా దినోత్సవంలో మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

రాయదుర్గంటౌన్: తెలుగుభాష ఔనత్యాన్ని నలుదిక్కులా వ్యాపింపజేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటారు. మండలంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులు తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకున్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయభాస్కర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నగేష్ మాట్లాడారు. అనంతరం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

మాతృభాషను కాపాడుకోవడం అందరి బాధ్యత..

ఉరవకొండ: మాతృభాష అయిన తెలుగును కాపాడుకోవడం అందరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు బాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లయన్స్ అధ్యక్షుడు మాట్లాడుతూ భాష ద్వారానే చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందుతాయన్నారు. లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ గణేష్ బాబు మాట్లాడుతూ గిడుగు రామమూర్తి వ్యవహారిక భాషకు చేసిన సేవ ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో తెలుగు విభాగం అధిపతి పరమేష్, అధ్యాపకులు మస్తానప్ప, రాజేష్, అయ్యన్న, కృష్ణవేణి, నారాయణస్వామి, వెంకటరాముడు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలోని అపిలేపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో తెలుగు బాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీసీ తిమ్మప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు లక్ష్మన్న, జయశ్రీ, సుగుణ, నళిని, అనసూయ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను సత్కరించిన దృశ్యం

ఉరవకొండ: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గతేడాది ఏపీ స్కూల్ గేమ్స్‌తోపాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో సీనియర్ పీడీ మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో విజేతలు, క్రీడాకారులు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం రాజేశ్వరీ చేతుల మీదుగా జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో విజేతలను సన్మానించారు. కార్యక్రమంలో పీడీలు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీ ప్రశాంత్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కులధ్రువీకరణలో ఈడిగ అని వచ్చేలా చూడండి

అనంతపురం అర్బన్: గ్రేటర్ రాయలసీమలోని ఈడిగలకు కులధ్రువీకరణ పత్రంలో పేరుకు ముందు గౌడ్ అని కాకుండా ఈడిగ అని వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఈడిగ సాధికారత సమితి సభ్యులు కోరారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను సమితి సభ్యులు వేణుగోపాల్, నాగభూషణం, లక్ష్మీనారాయణ, సూరిబాబు, నారాయణస్వామి, తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు వెంకటేష్, జగదీష్, రాజేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమైక్య తెలుగు రాజ్యం పార్టీకి కలెక్టర్ నోటీసు

అనంతపురం అర్బన్/ వజ్రకరూరు: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2019 నుంచి ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయలేదో కారణాన్ని రాతపూర్వకంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి సమర్పించాలని 'సమైక్య తెలుగు రాజ్యం' పార్టీకి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.వినోద్‌కుమార్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. వివరాలను కలెక్టర్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సమైక్య తెలుగు రాజ్యం పార్టీ అధ్యక్షుడు లేదా కార్యదర్శి సెప్టెంబరు 8న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎదుట విచారణకు హాజరవ్వాలన్నారు. లేని పక్షంలో నమోదైన రాజకీయ పార్టీల జాబితా నుంచి తొలగించనున్నట్లు నోటీసులో పేర్కొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కూడేరు: గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధచూపాలని మండల వైద్యాధికారిణి ఉషారాణి తెలియజేశారు. శుక్రవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు క్లినిక్ డే నిర్వహించారు. డాక్టర్ ఉషారాణి గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యశోద, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



ఫారూక్ (ఫైల్)

వజ్రకరూరు: మండల కేంద్రం వజ్రకరూరు సమీపంలో ఇటీవల ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి గాయపడిన యువకుడు ఫారుక్ (21) అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పామిడికి చెందిన షేక్ బాబాఫక్రుద్దీన్ నాలుగు రోజుల క్రితం నజీర్‌బాషా, ఫారూక్ (మహమ్మద్ రఫీ)తో కలిసి ద్విచక్ర వాహనంపై ఉరవకొండకు వెళ్లి తిరిగి వెళ్తుండగా, మార్గంమధ్యలో వజ్రకరూరు సమీపంలోని మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. నజీర్‌బాషా అనే యువకుడు అక్కడికక్కడే మరణించగా, షేక్‌బాబాఫక్రుద్దీన్ మరుసటి రోజు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అనంతపురంలో చికిత్స పొందుతూ ఫారూక్ (మహమ్మద్‌రఫీ శుక్రవారం ఉదయం మృతిచెందినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



ట్రాక్టర్ ఢీకొనడంతో గాయపడిన ఆంజనేయులు

రాయదుర్గంటౌన్: మండలంలోని రాతిబావివంక గేటు ఆంజనేయస్వామి గుడి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. గ్రామం నుంచి పురుషోత్తం అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై పొలానికి వెళ్తుండగా, వెనుకవైపు నుంచి ఆదే గ్రామానికి చెందిన భీమానాయక్ బైక్ ఢీకొనింది. ఈప్రమాదంలో పురుషోత్తం కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. భీమానాయక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గుమ్మఘట్ట మండలం కోనాపురం వద్ద ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో ఆంజనేయులు కాలుకు తీవ్ర గాయాలు కాగా, కుమారుడు విశ్వనాథ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తాళ్లకెరకు చెందిన ఆంజనేయులు తన కుమారుడు విశ్వనాథ్‌ను గుమ్మఘట్టలోని పాఠశాలకు తీసుకెళ్తుండగా కోనాపురం వద్ద వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో కుడికాలు తీవ్రంగా దెబ్బతినింది. ప్రమాదంలో కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగ్రాతులను 108 వాహనంలో రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు..

గుమ్మఘట్ట: మండలంలోని కోనాపురం వద్ద ట్రాక్టర్ ఢీకొని ఆంజనేయులు అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గొల్లలదొడ్డి వద్ద ప్రధాన రహదారిపై ఆగి ఉన్న ఆంజనేయులు ద్విచక్ర వాహనాన్ని తాటిచెర్ల నుంచి వచ్చిన టీడీపీ మాజీ సర్పంచ్ భర్త క్యాతన్న ట్రాక్టర్ డ్రైవర్ లింగప్ప ఢీకొన్నాడు.దీంతో ఆంజనేయులు కాలు పూర్తిగా విరిగిపోయింది. ద్విచక్రవాహనం నుజ్జునుజ్జయ్యింది. స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం గుమ్మఘట్ట పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురానికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

అపరిశుభ్రత నడుమ అంగన్‌వాడీ కేంద్రాలు



ఉరవకొండ మాస్టర్ సీవీవీ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద చిట్టడవిని తలపిస్తున్న దృశ్యం



ఉరవకొండ చౌడేశ్వరీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏపుగా పెరిగిన ముళ్లకంపలు



చౌడేశ్వరి కాలనీలో ప్రీస్కూల్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ముళ్లకంపలు

- కేంద్రాల చుట్టూ అల్లుకున్న ముళ్లకంపలు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న చిన్నారులు

ఉరవకొండ: పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు అపరిశుభ్రత నడుమ నడుస్తున్నాయి. కేంద్రాల చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. కేంద్రాలకు వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులు అనారోగ్యం బారిన పడుతున్నారు. స్థానిక మాస్టర్ సీవీవీ నగర్‌లోని 20వ అంగన్‌వాడీ కేంద్రం ఉట్టూ కంపచెట్లు పెరిగి చిట్టడవిని తలిపిస్తోంది. కేంద్రం చుట్టూ ముళ్లకంపలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. కేంద్రంలోకి వెళ్లలేని పరిస్థితి. దీంతో పాటు విషపురుగులు చాలా సార్లు కేంద్రం పరిసరాల్లో సంచరిస్తున్నట్లు స్థానికులు చెప్తున్నారు. చౌడేశ్వరి కాలనీలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల ముందు ముళ్ల కంపలు పెరగడంతో పాటు కాలనీవాసులు అంగన్‌వాడీ కేంద్రం ముందే చెత్త దిబ్బలు వేశారు. దీంతో అపరిశుభ్రత నెలకొంది. దీనికితోడు అపరిశుభ్రతతో దుర్వాసన భరించలేకపోతున్నామని కేంద్రానికి వచ్చేవారు చెప్తున్నారు. ఐసీడీఎస్ అధికారులు వెంటనే అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.